ఎగ్ బాకింది

కోడి గుడ్ల ధరకు **రెక్కలు** వచ్చాయి. ధర రో**జు రోజుకూ** ఎగబాకుతోంది. **కార్తీక మాసం** తర్వాత చికెన్, మటన్ **ధరలు పెరగాల్సి** ఉంది. వాటి ధరలు స్వల్పంగా **పెరగగా** గుడ్డు ధర మాత్రం పైకి **ఎగబాకుతోంది.** కోవిడ్ సమయంలో కూడా **లేనంత ధర** ఇప్పుడు ఉంది. ఒక **గుడ్డు దుకాణాల్లో** రూ.8, మాల్స్‌లో రూ.10 వరకూ పలకడంతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు.. అమ్మో..! గుడ్డు ధర ఇంతా అంటూ ఆశ్చర్యపోతున్నారు.



దుకాణాల్లో గుడ్డు రూ.8
మాల్స్‌లో రూ.10

20 రోజుల కిందట 30 గుడ్ల ధర రూ.145

ప్రస్తుతం రూ.210

పెదగంట్యాడ: గతంలో కోడిగుడ్డు ధర రూ.5 నుంచి రూ.6 మధ్య ఉండేది. వారం కిందట రూ. 6.30.రూ.7. ఉండేది. ప్రస్తుతం 8 రూపాయలకు విక్రయిస్తున్నారు. హోల్ సేల్‌లో 30 గుడ్లు ఉన్న ట్రే ధర రూ. 210 నడుస్తుతోంది. ఈ లెక్కన ఒక్కో గుడ్డు రూ.7 పడుతుంది. ఇక సూపర్ మార్కెట్‌లలో గుడ్డు రూ. 10కి అమ్ముతున్నారు. చికెన్ ధర మాత్రం గతంలో కిలో రూ.180 నుంచి 210 మధ్య ఉండగా..ఇప్పుడు కూడా అదే రేటులో ఉంది. మటన్ ధర గతంలో రూ.800 నుంచి రూ.1000 వరకు ఉండగా ప్రస్తుతం అదే ధర కొనసాగుతోంది. కోడి గుడ్డు ధర ఇంతలా పెరగడంతో వినియోగదారులు షాక్ తింటున్నారు.

రోజూ 2 లక్షల పైమాటే..

మండలంలో రోజువారీ కోడిగుడ్ల వాడకం 2 లక్షల పైమాటే ఉంది. గుడ్డు ఆరోగ్యకరమని చెబుతున్న వైద్యుల సలహాల మేరకు వినియోగదారులు పెరిగిపోతున్నారు. మండలంలో ప్రజలతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా గుడ్ల వినియోగం అధికంగా జరుగుతోంది. దీనికి తోడు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లు అధికంగా ఉండడంతో గుడ్లు వినియోగం అధికమైంది.

ధర దడ

పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు వంటింట్లో సెగలు పుట్టిస్తున్నాయి. కూరగాయల రేట్లతో పాటు ఉప్పు నుంచి పప్పు వరకూ ప్రతి వస్తువుధర కొండెక్కి కూర్చొంది.దీనికి తోడు అందరికీ అందుబాటులో ఉండే గుడ్ల ధర కూడా పెరగడంతో ఏం కొనేటట్టు లేదు.. తినేటట్టు లేదని ఆవేదన చెందుతున్నారు. ధరలను నియంత్రించి పేదప్రజలను ఆదుకోవాలని కోరుతున్నారు.

సామాన్యులకు పస్తులే



ఇప్పటికే నిత్యావసర సరకులు ధరలు బాగా పెరిగిపోవడంతో చాలా వరకూ వంటలు తగ్గించాం. ఇంటికి ఎవరైనా బంధువులు వస్తే భయపడాల్సి వస్తోంది. కూరగాయలతో పాటు ఆఖరికి గుడ్డు ధర కూడా పెరిగిపోవడంతో ఏమీ తినలేకపోతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధరలను నియంత్రించి పేదలను ఆదుకోవాలి.

– కె. ధనలక్ష్మి, నడుపూరు

వ్యాయామాలు చేసిన వారికి గుడ్డు పడాల్సిందే..

గుడ్డు పౌష్టికాహారం కావడంతో జిమ్‌కి వెళ్లే వారు అధికంగా వాడుతారు. పార్కులు, జిమ్‌ల ఆవరణలో ప్రత్యేకంగా ఉడకబెట్టిన గుడ్లు, రాగి సంకటి స్టాల్స్ వెలిశాయి. దీంతో గుడ్ల వినియోగం పెరిగింది. మరో వైపు క్రిస్మస్, న్యూ ఇయర్ వంటి పండగలు వస్తుండడంతో బేకరీ ఫుడ్స్, కే క్‌ల తయారీలో గుడ్లు వినియోగించడంతో ఎన్నడూ లేని విధంగా ధరలు పెరిగాయని నిపుణులు చెబుతున్నారు.



గుడ్ల ధర పెరుగుదల ఇలా..

ఆగస్టులో రిటైల్ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు రూ.5.50 పైసలు ఉండగా ఇప్పుడు రూ.8కి పెరిగిపోయింది. 20 రోజుల కిందట 30 గుడ్ల ట్రే హోల్‌సేల్‌లో రూ.145 ఉండగా నేడు రూ.210 పలుకుతోంది.

ధరల భారం



అన్ని వస్తువుల ధరలు ఇంతలా పెరిగిపోవడం ఎప్పుడూ చూడలేదు.ఓ వైపు పనులు సరిగ్గా లేక ఇబ్బందులు. ఇప్పుడు పెరిగిన ధరలతో మార్కెట్‌కు వెళ్లి ఏమైనా కొనాలంటే భయమేస్తోంది. ఇలా అయితే మాలాంటి పేద, మధ్యతరగతి ప్రజలు ఎలా బతకాలి. ప్రభుత్వం స్పందించి ధరలు నియంత్రించాలి.

–ఎం ఆదిలక్ష్మి, పెదగంట్యాడ

క్లుప్తంగా

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



మెరిట్ స్కాలర్‌షిప్ అందుకున్న విద్యార్థులు

అగనంపూడి: చదువుల్లో రాణిస్తున్న విద్యార్థులకు ఉల్లాస్ ట్రస్ట్ చేయూతనిస్తుందని ట్రస్ట్ ప్రతినిధి మహేష్ అన్నారు. 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ పినమడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9, 10 తరగతుల్లో మెరిట్ విద్యార్థులు పది మందికి రూ.వెయ్యి చొప్పున అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతంగా స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కె.కొండబాబు, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫార్మా క్షతగాత్రులకు పరామర్శ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

అక్కిరెడ్డిపాలెం: పరవాడలోని రక్షిత డ్రగ్స్ ఫార్మా కంపెనీలో సోమవారం జరిగిన ప్రమాదంలో 4 గురు అస్వస్థతకు గురయ్యారు. వీరిలో ఇద్దరిని షీలానగర్ కిమ్స్ ఐకాన్‌లో చేర్పించారు. ఒడిశా రాష్ట్రం మన్‌డీ భీషీ, రాయఘడకు చెందిన దేవ్ భాగ్ (38), ఉగ్రేష్ గౌడ (26)కు ఎంఐసీయూలో వైద్యం అందిస్తున్నారు. వీరిలో దేవ్ బాగ్ పరిస్థితి విషమంగా ఉందని సమాచారం.వీరిని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పరామర్శించారు.

ఘనంగా డీ పాల్ వార్షికోత్సవం



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థినులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–9లోని డీ పాల్ పాఠశాల వార్షికోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. కర్ణాటక స్టేట్ ఫారెస్ట్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. వెంకటేశన్, ప్రముఖ సినీ దర్శకుడు నక్కి త్రినాథరావు అతిథులుగా హాజరయ్యారు. వెంకటేశన్ మాట్లాడుతూ దేశానికి అర్థవంతమైన సహకారం అందించడానికి విద్యార్థులు తమ సామర్థ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అనీష్ మాథ్యూ, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ షాజి, డీన్ ఆఫ్ స్టడీస్ ప్రవీణ్ పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక రేపు

గాజువాక: వచ్చేనెల 3 నుంచి 5వ తేదీ వరకు కర్నూలులో నిర్వహించనున్న ఎం.రంగారావు మెమోరియల్ 50వ అంతరజిల్లాల బాల బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి విశాఖ జిల్లా కబడ్డీ జట్ల ఎంపికను బుధవారం నిర్వహించనున్నట్టు ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉరుకూటి శ్రీనివాసరావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ పి.కోటేశ్వరరావు తెలిపారు. ఈ ఎంపిక పోటీలు గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు ప్రాంభమవుతాయన్నారు. క్రీడాకారులు 12 జనవరి 2005లోపు జన్మించి ఉండాలని, బాలురు బరువు 70 కేజీలు, బాలికల బరువు 65 కేజీలు ఉండాలని పేర్కొన్నారు. వివరాల కోసం 7680005666, 9885698717 నంబర్లలో సంప్రదించాలన్నారు.

విశేషంగా ధనుర్మాస పూజలు

అక్కిరెడ్డిపాలెం: భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల వేంకటేశ్వర స్వామి, వినాయక స్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా విశేష పూజలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయంలో బాల వినాయక స్వామికి, దాసాంజనేయ స్వామికి, ప్రసన్న వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

రూ.1.02 కోట్ల ఆస్తిపన్ను వసూలు



జెడ్సీ శేషాద్రికి ఆస్తి పన్ను చెక్కులు అందజేస్తున్న రెవెన్యూ విభాగం అధికారులు

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్ రెవెన్యూ విభాగం అధికారులు సోమవారం రూ.1.02 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేశారు. బీహెచ్‌ఈఎల్ నుంచి రూ.88 లక్షలు, రెండు ప్రైవేట్ కళాశాలలు రూ.14 లక్షల ఆస్తి పన్ను చెల్లించాయి. వీటికి సంబంధించిన చెక్కులను రెవెన్యూ అధికారులు సీహెచ్.రామనారాయణ, ఎం.శ్రీకాంత్, ఆర్ఐ సుభాన్ తదితరులు సోమవారం గాజువాక జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్. శేషాద్రికి అందజేశారు. రెవెన్యూ అధికారులను జెడ్సీ అభినందించారు. ఆస్తి పన్నులను శత శాతం వసూలు చేసే విధంగా కృషి చేయాలని సూచించారు.

నావికాదళ సివిల్ ఉద్యోగులకు నగదు రహిత క్యాన్సర్ వైద్యసేవలు



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న హోమీబాబా, తూర్పు నావికాదళ అధికారులు

అగనంపూడి : తూర్పు నౌకాదళంలో విధులు నిర్వహించే సివిలియన్ ఉద్యోగులకు నగదు రహిత క్యాన్సర్ వైద్యసేవలు అందించేందుకు హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి, తూర్పు నౌకాదళ కమాండర్ మధ్య పరస్పర ఒప్పందం కుదిరింది. ఈమేరకు తూర్పు నావికాదళ కమాంటెండ్ అధికారులు ఈ విషయాన్ని ఒక ప్రకటనలో తెలిపారు. రక్షణ దళంలోని సివిలియన్ ఉద్యోగులకు మెరుగైన క్యాన్సర్ చికిత్స అందించే లక్ష్యంతో ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్టు వారు పేర్కొన్నారు.

వంతెన విస్తరించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అగనంపూడి: అగనంపూడి నిర్వాసితకాలనీలు, జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీల మధ్యస్తంగా ఉన్న మూడగుడుల అండర్ పాత్ వంతెనను విస్తరించాలని అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల నాయకులు సోమవారం కలెక్టర్ హరేందిర ప్రసాద్‌ను వినతిపత్రంలో కోరారు. 85, 88 వార్డుల్లోని సుమారు 70 వేల మంది ప్రజలకు అందుబాటులో ఉన్న ఈ ఇరుకు వంతెన వల్ల పాదచారులు, సైకిళ్లపై రాకపోకలకు అవకాశం ఉందని, ద్విచక్రవాహనాలు వచ్చి పోవడానికి ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. హోమీబాబా క్యాన్సర్‌ఆస్పత్రి, అగనంపూడి వంద పడకల ఆస్పత్రి, కళాశాలలు, బ్యాంక్‌లకు జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీల నుంచి చుట్టూ తిరగాల్సి వస్తుందని, ఈ నేపథ్యంలో రెండు వార్డు ప్రజల అనువుగా ఉన్న వంతెనను విస్తరించాలని నాయకులు కోరారు. నాయకులు మోటూరి వెంకటరమణ, బలిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నీరుకొండ రామచంద్రరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. సెంట్రల్స్ స్టోర్స్ యూనియన్ పాయింట్ వద్ద సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాత్రింబవళ్లు ఉద్యోగులు కష్టపడి పనిచేస్తూ ప్రతీ రోజు సుమారు 14 వేల టన్నుల ఉక్కు ఉత్పత్తి చేస్తున్నారన్నారు. అమ్మకాలు కూడా పెరిగినా సెప్టెంబర్ నెల నుంచి జీతాలు చెల్లించక పోవడం దుర్మార్గమన్నారు. ప్రతీ ఉద్యోగికు 185 శాతం జీతం పెండింగ్ పెట్టారన్నారు. రాబోయే రోజుల్లో క్రిస్మస్, న్యూ ఇయర్ సంక్రాంతి పండగలు ఉన్నాయన్నారు. మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం వల్ల ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.తక్షణమే పెండింగ్ వేతనం చెల్లించాలన్నారు. అనంతరం హెచ్‌ఆర్ సీజీఎంను కలిసి సమస్యను వివరించారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానిస్తే సహించేది లేదు



స్టీల్‌ప్లాంట్‌లో ధర్నా చేస్తున్న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, కేవీపీఎస్ నాయకులు

ఉక్కునగరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌ను అవమానించే విధంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడడం సమంజసం కాదని.. తక్షణమే ఆయన దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, కేవీపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం స్టీల్‌ప్లాంట్ హిల్‌టాప్ కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్ పేరుకు బదులు దేవుడి పేరు తలుచుకుంటే స్వర్గప్రాప్తి కలుగుతుందని అనడం దారుణమన్నారు. అంబేడ్కర్ వర్ధంతి, జయంతి సమయంలో ఆయన విగ్రహాలకు పూల దండలు వేసి ప్రజలకు వంగి వంగి దండాలు పెట్టి మాట్లాడటం ఎంతవరకు సమంజసమన్నారు. ఆర్‌ఎస్ఎస్, బీజేపీ అంబేడ్కర్‌పై విష ప్రచారం చేయడం మానుకోవాలన్నారు. బీజేపీలో ఉన్న దళిత నాయకులు తక్షణమే కేంద్ర ప్రభుత్వంపై తిరుగుబాటు చేయాలన్నారు. వారు ఆ పదవులకు రాజీనామా చేసి జాతి రక్షణ కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు భయ్యే మల్లయ్య, ఎస్. సత్యనారాయణ, వై.టి. దాస్, చిరంజీవి, వి. ప్రకాశ్, రామస్వామి, పుల్లారావు, కె. పరంధామయ్య, రమణ, రవి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ కాంతులు

ముస్తాబైన చర్చిలు



విద్యుత్ అలంకరణలో ఉక్కునగరం సేవియర్ చర్చి



ముస్తాబైన ఉక్కునగరం రూపాంతర దేవాలయం

ఉక్కునగరం: క్రిస్మస్ సమీపించడంతో మార్కెట్లు, చర్చిలు కళకళలాడుతున్నాయి. విద్యుత్ లైట్ల అలంకరణలో చర్చిలు కాంతులీనుతున్నాయి. క్రిస్మస్‌కు సంబంధించిన స్టార్స్, విద్యుత్ లైట్లు, క్రిస్మస్ ట్రీలు, శాంతాక్లాజ్ డ్రెస్సెస్, టోపీలు... ఇలా ఎన్నో రకాల వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. చర్చిల్లో ఇప్పటికే ముందస్తు వేడుకలు కొనసాగుతున్నాయి. యూత్ క్రిస్మస్, చిన్నారుల సందడి సందడి మొదలైంది. ఉక్కునగరం సెక్టార్–8 లోని క్రైస్ట్ ది సేవియర్ క్యాథలిక్ చర్చిలో మంగళవారం రాత్రి నుంచే వేడుకలను ప్రారంభించనున్నారు. రాత్రి 11 నుంచి ప్రార్థనలు ప్రారంభకానున్నాయి. బుధవారం చర్చి ఫాదర్ నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. సెక్టార్–12లోని అసెంబ్లీ ఆఫ్ గాడ్ చర్చిలో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడానికి ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. అదే విధంగా ఉక్కునగరం రవీరేస్ బంక్ సమీపంలోని అధునాతమైన రూపాంతర లూథరన్ దేవాలయంలో క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. చర్చి ఫాదర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

ఉక్కునగరం: స్థానిక అరబిందో పాఠశాలలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ఆవరణలో జరిగిన వేడుకల్లో కరస్పాండెంట్ డాక్టర్ వి. రామారావు మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం భారత దేశం అన్నారు. అన్ని మతాల సారాంశం ఒక్కటే అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. విద్యార్థులు శాంతాక్లాజ్ వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల సమన్వయకర్త టి. ఎల్లేశ్వరరావు, ప్రిన్సిపాల్ జంగం ప్రసాద్‌తో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉక్కు అరబిందో పాఠశాలలో క్రిస్మస్ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

విజ్ఞాన్‌లో ఘనంగా సెమీ క్రిస్మస్

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు జగ్గరాజుపేటలోని విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేశారు.



గీతాలాపన చేస్తున్న విద్యార్థులు



ఉత్సవాలను ప్రారంభిస్తున్న అధ్యాపకులు

పీడీఎస్ బియ్యం పక్కదారి

గాజువాక నుంచి అక్రమ రవాణా

గాజువాక: పేదలకు అందాల్సిన చౌక బియ్యం పక్కదారి పడుతున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గడిచిన రెండు నెలల్లో గాజువాక సర్కిల్‌లో సుమారు 12 కేసులు నమోదయ్యాయి. ఈ వ్యవహారంలో వ్యాన్ డ్రైవర్లతో పాటు కొంత మంది రేషన్ డీలర్ల పాత్ర కూడా ఉన్నట్టు ఆరోపణలున్నాయి. టాస్క్ ఫోర్స్, పోలీసులు, సివిల్ సప్లై అధికారులు ఇటీవల దాడులు చేసిన బియ్యం పట్టుకున్నప్పటికీ ఎవరిపైనా చర్యలు తీసుకున్న దాఖలాలు మాత్రం కనిపించలేదు.

- పది రోజుల కిందట స్థానిక జింక్ నుంచి బీహెచ్‌పీవీ మార్గంలో ఒక వ్యాన్‌లో బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న విషయం తెలుసుకున్న అధికారులు దాడి చేసి బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యాన్‌లో బియ్యాన్ని గాజువాక నుంచి సబ్బవరం తరలిస్తున్నట్టు ఆ వ్యాన్ డ్రైవర్ తెలిపిన విషయం తెలిసిందే.
- రెండు నెలల కిందట గాజువాక బీసీ రోడ్‌లో రెండు ఆటోల్లో లోడైన రేషన్ బియ్యం అధికారులు పట్టుకున్నారు.
- పెదగంట్యాడ దరి ఒక రేషన్ డిపోలో సుమారు 100 బియ్యం బస్తాలు మాయమైన విషయం తెలిసిందే. దీనిపై పోలీస్ కేసు నమోదు కాగా ఆ బియ్యం దొంగతనం చేసినట్టు తేల్చేశారు. దీనిపై పౌరసరఫరా అధికారులు మాత్రం తదుపరి విచారణ చేపట్టలేదనే విమర్శలున్నాయి.
- ఇటీవల కాలంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి దిబ్బపాలెంలోని ఒక ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రెండు టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నారు.
- గాజువాక రాజీవ్‌మార్గ్‌లో రెండు నెలల కిందట బొలేరో వాహనంలో రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే.



జింక్ రోడ్‌లో అధికారులు పట్టుకున్న రేషన్ బియ్యం (ఫైల్)

వ్యాన్ వద్దే విక్రయాలు

ఇదిలా ఉండగా ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యంను కొంతమంది లబ్ధిదారులు వ్యాన్ వద్దే విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. బియ్యం వ్యాన్ ఉన్న వీధుల్లోనే కొంతమంది వ్యక్తులు తిష్టవేసి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. అత్యధిక ప్రాంతాల్లో వ్యాన్ డ్రైవర్లే లబ్ధిదారుల నుంచి వేలిముద్రలను తీసుకొని బియ్యం బదులు కిలోకు రూ.10 నుంచి రూ.12 వరకూ చెల్లిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై అధికారులు దృష్టి సారించి అక్రమాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.